
# ప్రేయసి కౌగిలిలో...

హారర్ స్టోరీ

కస్తూరి మురళీకృష్ణ





**నా కళ్లతో నేను చూస్తున్న దాన్ని నిజం అనలేను. నేను చూస్తున్నది అబద్ధం అనలేను. అది భ్రమనో, మాయనో, కలనో, నిజమో నాకేమీ తెలియటం లేదు. అందుకే, మీరు నమ్మినా, నమ్మకున్నా, నన్ను పిచ్చివాడని కొట్టేసినా, నేను, నా కళ్లతో చూసిన దాన్ని, ఈ శరీరంతో అనుభవించిన దాన్ని మీకు ఉన్నదున్నట్టు జరిగింది జరిగినట్టు చెప్పాలని నిశ్చయించుకున్నాను.**

రూప్‌కుమార్ నా స్నేహితుడు. రూప్ కుమార్ కన్నా అతని భార్య సంగీత నాకు సన్నిహితం. ఆమెని నేను ప్రేమించాను. ఆమె నన్ను తిరస్కరించింది. రూప్ కుమార్‌ను పెళ్లి చేసుకుంది. అయినా మా మధ్య స్నేహ భావం చెడలేదు. మా మధ్య మైత్రి కొనసాగుతూనే వచ్చింది.

అందుకే సంగీత ఫోన్ చేసి అర్జంటుగా రమ్మంటే, కాదనలేక పోయాను. వెళ్లాను. సంగీత ఏడుస్తోంది. ఏడుస్తూ విషయం చెప్పింది.

'రూప్ ఇంటికి వచ్చి వారం దాటింది. ఈ మధ్య ఎందుకో పూర్తిగా మారిపోయాడు. నువ్వేమైనా విషయం కనుక్కోగలవా?' అడిగింది ఏడుపు మధ్య.

నాకు విషయం చూచాయగా తెలుసు. కానీ ఎవరికి నా అనుమానం చెప్పినా నమ్మరని నోరిప్పలేదు.

'వారం నుంచీ రాలేదా?' అడిగాను.

తల అడ్డంగా ఊపింది

'ఎటు వెళ్లాడో తెలుసా?' అని ఆగి, 'ఈ మధ్య రాత్రిళ్లు డ్యూటీకి వెళ్తున్నాడా?' అడిగాను. 'అవును. డబుల్‌డ్యూటీ అన్నారు.' అమాయకంగా చెప్పింది సంగీత. నాకు అర్థమయింది. వాడు ఎటెళ్లాడో తెలుసు.

కానీ పైకి 'నేను చూస్తాను. కంగారు పడకు' అని ధైర్యం చెప్పి వచ్చేశాను.

రూప్ కుమార్ ఓ నెల క్రితం నాదగ్గరకు వచ్చాడు.

'హైదరాబాద్ నగర పొలిమేరల్లో దమ్మాయిగూడ అని ఓ గ్రామం ఉందట. ఆ గ్రామంలో ప్లాట్లున్నాయట. చూద్దాం వస్తావా?' అనడిగాడు.

'నాకు పని ఉంది. నువ్వెళ్లి చూసిరా. బాగుంటే నేను వస్తాను' అన్నాను.

తరువాత రోజు ఫోన్ చేశాడు.

'ప్లాట్లు చూశాను. బాగానే ఉన్నాయి. దమ్మాయిగూడ గ్రామం దాటిన తరువాత ఓ కొండ వస్తుంది. ఆ కొండకు దగ్గరలో ఉన్నాయి. మనుషులకు కాస్త దూరమే అయినా ప్రశాంతంగా ఉంటుంది. నేనివ్వాళ్ల వెళ్తున్నాను. మరోసారి చూడాలని ఉంది. ఎందుకో చూడగానే నాకు నచ్చింది. వస్తావా?' అనడిగాడు.

నేను ఆరోజూ బిజీగా ఉన్నాను. వెళ్లలేక పోయాను.

రెండు మూడు రోజుల తరువాత హఠాత్తుగా గుర్తొచ్చింది. ఫోను చేశాను.

ఫోనెత్తలేదు రూప్ కుమార్.

నేను ఆ విషయం మరచి పోయాను.

తరువాత ఓ రోజు తెల్లారిఝామున ఎవరో ఫోన్ చేశారు.

'రూప్ కుమార్ మీకు తెలుసా?' అనడిగారు.

'తెలుసు' అన్నాను.

'ఇక్కడ రోడ్డుమీద పడి ఉన్నాడు. బాగా తాగినట్టున్నాడు. వచ్చి తీసుకుపోండి' అన్నాడు.

దారి కనుక్కుని బయలు దేరాను వెంటనే.

నేను దమ్మాయిగూడ చేరుతుండగానే రాజీవ్‌గాంధీ విగ్రహం దగ్గర కూచిని కనిపించాడు రూప్‌కుమార్. నీరసంగా ఉన్నాడు. కానీ కళ్లల్లో మెరుపుంది.

'ఏమయిందిరా? తాగావా?' అడిగాను.

'ముందు పద. వేడి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం' అన్నాడు.

హోటల్‌కి చేరగానే, అడిగాను. 'ఏమిటి విషయం?' అని.

'ఎవ్వరికీ చెప్పకు. ముఖ్యంగా సంగీతకి ' అని నా దగ్గర వాగ్దానం తీసుకున్నాడు.

ఆ తరువాత, నా మీదకు వంగి, రహస్యంగా గుసగుసగా చెప్పాడు.

'నేను నిజంగా ప్రేమలో పడ్డాను.'


ఉలిక్కిపడ్డాను. తన్నాలనిపించింది.

ఒక పక్కన సంగీతను మరచి పోలేక నేను పెళ్లి చేసుకోకుండా ఉండిపోయాను. ఇక్కడ వీడు సంగీత విలువ తెలుసుకోకుండా, ఇంకో అమ్మాయి ప్రేమలో పడ్డాడు. చంపేయాలనిపించింది.

'ఎవరా అమ్మాయి?' కటువుగా అడిగాను.

చాలాసేపు మౌనంగా ఉన్నాడు. చివరికి మెల్లగా చెప్పటం ప్రారంభించాడు.

'ఆరోజు నేను ఆఫీసయిన తరువాత మరోసారి ప్లాట్ చూడాలని వెళ్లాను. చీకటి పడింది. దారి తప్పాను. ఇంతలో వర్షం వచ్చింది. దగ్గరలో ఓ పాడుపడిన ఇల్లు కనిపిస్తే ఆ ఇంటిలోకి వెళ్లాను. రెండు గదులున్నాయి. మనషులెవరూ ఉంటున్నట్టు లేదు. వర్షం తగ్గేదాక ఉండటానికి బాగానే ఉంటుందనుకున్నాను. సిగరేట్ వెలిగించాను.' అని ఆగి నా వైపు చూశాడు.



వాడి కళ్లు చూస్తుంటే భయం వేసింది. ఓ రకంగా ఉన్నాయి. కనబడని దాన్ని చూస్తున్నట్టున్నాయి.

'అప్పుడు గమనించాను. ఆ వర్షంలో తలదాచుకునేందుకు ఆ గదిలో నేనొక్కడినే కాదు ఇంకో అమ్మాయి కూడా ఉందని' అన్నాడు.

'అమ్మాయా? ఒంటరిగా అక్కడేం చేస్తోంది?' కోపంగా అరిచాను.

'ష్.... ' అన్నాడు. 'అరవకు... ముందు నేను బెదిరాను. కానీ, ఆ అమ్మాయి నన్ను చూసి బెదర లేదు. నవ్వింది. ఎంత అందంగా ఉందనుకున్నావు ఆమె నవ్వు. సూర్యోదయంలో తొలికిరణం తాకిడికి పులకరించిన పూరేకులపై మెరిసిన మంచు బిందువులా ఉంది ఆమె నవ్వు.'

'కవిత్వం వద్దు కథ చెప్పు' అన్నాను చిరాకుగా.

'ఇక్కడేం చేస్తున్నావు?' అడిగానామెని. నా చిరాకును పట్టించుకోకుండా చెప్తు పోతున్నాడు రూప్ కుమార్.

ఆమె మళ్లీ నవ్వింది. 'నన్ను చూస్తే భయం వెయ్యటం లేదా?' అనడిగింది.

'ఎందుకు భయం? నన్ను చూసి నువ్వు భయపడాలి' అన్నాను నేను.

దానికి ఆమె వెన్నెల విరిసినట్టు నవ్వి. 'నన్ను చూసి అందరూ భయపడతారు. అందుకే ఈ ప్రాంతమంతా ప్లాట్లు చేసి అమ్ముతున్నా, కొండలను చదును చేస్తున్నా, ఈ ఇంటిని తాకలేదు.'

'నిన్ను చూసి భయం ఎందుకు?' అనడిగాను. ఎందుకు నాకు ఆమెని చూస్తే భయం అనిపించటం లేదు.

'నేను చచ్చిపోయిన దాన్ని. అందరూ నన్ను దయ్యం అంటారు' చెప్పిందా అమ్మాయి.

నేను రూప్‌కుమార్ వైపు నిశితంగా చూశాను. 'వీడికి పిచ్చి పట్టింది' అనుకున్నాను. ఆ పిల్ల తాను దయ్యాన్నీ అని చెప్పినా. పరుగెత్తి రాని వీడి మెదడును పరీక్షించాలి అనుకున్నాను.

'ఆ అమ్మాయి దయ్యం అన్నా నీకు ఏమీ అనిపించలేదా?' అడగకుండా ఉండలేకపోయాను.

'అసలు దయ్యం అంత అందంగా ఉంటుందంటే, నేను మనుషుల దిక్కు కూడా చూసేవాడిని కాను. ఆ అమ్మాయి నన్ను చూసి ఎంతగా సంతోషించిందో తెలుసా! ఎన్నో ఏళ్ల నుంచి అక్కడ ఒంటరిగా ఉంటున్నదట. ఎవరూ ఆ వైపుకి రాకపోవటం వల్ల విసుగు వస్తున్నదట. నన్ను చూస్తే ఆమె ప్రాణం లేచి వచ్చిందట. అసలు, ఆమెతో మాట్లాడుతుంటే సమయం తెలియలేదు. నేనెవరో గుర్తుకు రాలేదు. ఆమె ఒక అందమయిన అమ్మాయి, నేను పురుషుడిని అన్న ఆలోచన తప్ప మరో ఆలోచన లేదు. సమయం గడుస్తున్నకొద్దీ 'మళ్లీ వస్తావా?' మళ్లీ వస్తావా? అని ఎంత జాలిగా అడిగిందంటే, మళ్లీ వస్తానని వాగ్దానం చేయకుండా ఉండలేక పోయాను. కానీ, ఆమె రాత్రిపూటకే ప్రాణం పోసుకుంటుందట. సూర్య కిరణాలకు ఆమె శరీరం కరిగి పోతుందట. అందుకని రాత్రిపూటనే రమ్మంది.

నేను సంగీతకు డబుల్ డ్యూటీ అని చెప్పి, రాత్రిళ్లు ఇక్కడికి వస్తున్నాను. ఆమెతో గడుపుతుంటే కాల గమనం తెలియటం లేదు. అసలీ భూ ప్రపంచంలో ఇంత సంతోషంగా సుఖంగా కాలం గడుస్తుందని నాకు ఇప్పుడే అర్థమయింది. నేను ఆమెని ప్రేమిస్తున్నాను. కానీ మా ప్రపంచాలు వేరని తెలుసు. అయినా, ఆమెని కలవకుండా ఉండలేక పోతున్నాను.' ఏదో లోకంలో ఉన్న వాడిలా చెప్పాడు.

'మరి ఈ రోడ్డు మీద పడిపోవటం ఏమిటి?' అడిగాను.

చాలా సేపు మౌనంగా ఉన్నాడు. చివరికి చెప్పాడు.

'నిన్న నేను ఆగలేక పోయాను. నేను ఆమెని ప్రేమిస్తున్నానని చెప్పాను. దానికి ఆమె ఎంతగా నవ్విందో తెలుసా! ఇలాగే ఒకడు ఆమెని ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేశాడట. ఆమెని అనుభవించి వెళ్లిపోయాడట. ఆ కాలంలో పెళ్లికాకుండా గర్భవతి అయితే సమాజం క్రూరంగా వ్యవహరించేది. ఆమెని వెలివేసింది. ఇదిగో, ఊరికి దూరంగా ఉన్న ఈ ఇంట్లో తలదాచుకుందట. అతడికోసం ఎదురు చూస్తూ, తిండికి లేక మరణించిందట. అప్పటి నుంచీ ఇక్కడే ఇంకా అతడి కోసం ఎదురు చూస్తూనే ఉందట. అందుకే, నేను ప్రేమిస్తున్నానని చెప్తే విరగబడి నవ్వింది.'

'ఆ కాలంలో అంటున్నావు. ఆమె ఏకాలం నాటిది?' అడిగాను.

'తేదీలు సరిగ్గా చెప్పలేక పోతోంది కానీ, చాలా కాలం అయి ఉంటుంది. ఓ వందో, రెండొందలలో సంవత్సరాలయి ఉంటుంది.'

కాజువల్‌గా చెప్తున్న వాడిని ఉప్పుపాతర వేయాలనిపించింది. ఆలోచనను ఆణుచుకున్నాను. వంద, రెండు వందల సంవత్సరాలట!

'బుద్ధుందా?' అని తీవ్రంగా మందలించబోయిన నేను వాడి ముఖం చూసి ఆగిపోయాను. వాడి ముఖంలో ఆనందం, వేదన రెండు కలగలసిన భావన కనిపిస్తోంది.

'ఆమె నవ్వుతుంటే, మరింత అందంగా కనిపించింది. ఎంత అందంగా కనిపించిందంటే, నన్ను నేను మరచి పోయాను. ఆమెకు శరీరం లేదని నాకు శరీరం ఉందని మరచి పోయాను. ఆమెని కౌగలించుకున్నాను.' అని ఆగిపోయాడు.

ఒక్కసారిగా నా వొళ్లు జలదరించింది ఎందుకంటే, వాడి శరీరం మీద రోమాలు నిక్కబొడుచుకోవటం నాకు స్పష్టంగా తెలుస్తోంది. అంతేకాదు, వాడి శరీరంలోని సన్నని వణుకు టేబుల్‌ని గడగడలాడిస్తోంది.

హఠాత్తుగా వాడు వొంగి, నా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

'రేయ్ అసలా అనుభవాన్ని ఏమని వర్ణించాలి! నా శరీరం విద్యుత్తు నిండిన గాలిని, కాదు, కాదు, శూన్యాన్ని తాకినట్టనిపించింది అదొక తెలియని హాయి అలవికాని బాధకలగలసిన మధుర భావన. తిమ్మిరెక్కిన తరువాత శరీరం కదిపితే ఉండే కావాలనిపించినా భరించలేని హాయి అది. కానీ అది ఉంది ఒక్క సెకను కాలమే. ఆ తరువాత ఒక మెరుపు తీగ నా బాహువుల్లో ఇమిడిందనిపించింది. నాకు మెలకువ వచ్చే సరికి రోడ్డు మీద పడి ఉన్నాను.' చివరి మాటలంటుంటే వాడి కళ్లల్లో ఏదో కోల్పోయిన భావన. నాకేమనాలో తోచలేదు. మౌనంగా ఉన్నాను. కానీ ఎందుకో అసూయ లాంటిది అనిపించింది.

నేను ప్రాణప్రదంగా ప్రేమించిన సంగీత వాడిదయింది. ఇప్పుడు నేను కలలో కూడా ఊహించలేని అనుభవాన్ని అనుభవించాడు.

'నాకు మళ్లీ ఆ అనుభవం కావాలని ఉంది. సలుపుతున్న పుండు చుట్టూ గిల్లుతూంటే ఎంత హాయిగా ఉంటుందో అలాంటి హాయి అది. చైతన్యాన్ని హరించే విద్యుత్ స్పర్శ ఎంత అద్భుతంగా ఉంటుందో అంతగా చెప్పరానంత అద్భుతమైన అనుభవం అది.'

'నువ్వు మళ్లీ ఈ వైపుకు రాకు. నువ్వు చెప్తున్నదే నిజమైతే ఆమె దయ్యం. దయ్యంతో మనిషికి కుదరదు. నువ్వు చచ్చి, ఆపాడు పడిన ఇంట్లో ఆ దయ్యంతో కాపురం పెట్టాల్సి ఉంటుంది. చూడూ సంగీత లాంటి అమ్మాయి దొరకటం నీ అదృష్టం. వెర్రి వేషాలేయకు' నాలోని అసూయ నా మాటలను కసినీ, తీవ్రతను అధికంగా చేసింది.

రూప్‌కుమార్ మాట్లాడలేదు. కానీ వాడిని ఇంటి ముందు దిగబెడుతూంటే, నా చెయ్యి పట్టుకుని బ్రతిమిలాడుతున్నట్టు అన్నాడు. 'ఒరేయ్ సంగీతకు ఈ విషయం చెప్పకు. నువ్వు చెప్పింది నిజం. నేను దయ్యం జోలికి పోను. కానీ నేను వెళ్లక పోతే... అందరిలాగే నేనూ మోసం చేశాననుకుంటుందేమోనని బాధ. నా కోసం ఎదురు చూస్తూ...'

వాడి మాటలకు అడ్డు వచ్చాను.

'దయ్యం ఏమనుకుంటే నీకేమిటి? ఆమె నీ కోసం కాదు, ఆ మోసం చేసిన వాడి కోసం ఎదురు చూస్తుంటుంది. నోరు మూసుకుని పద. మళ్లీ ఆవైపు వెళ్తే సంగీతకు నిజం చెప్పటమే కాదు, పోలీసులకు చెప్పి ఆ ఇల్లు కూలగొట్టిస్తా. నీ దయ్యానికి నిలువనీడ లేకుండా చేస్తా' బెదిరించాను.

కానీ ఎందుకో నాకు, మన సినిమాల్లో విలన్లు గుర్తొచ్చారు. ప్రేమించిన వారిని ఇలాగే బెదిరిస్తారు. కానీ నేను బెదిరించింది వాడి మంచి కోసమేకదా, ఎవడైన కట్టుకున్న భార్యని వదిలి దయ్యం వెంట పడతాడా?

ఇది జరిగి వారం, పది రోజులయి ఉంటుంది. సంగీత నుంచి ఎలాంటి ఫోను రాకపోతే రూప్‌కుమార్‌కు బుద్ధి వచ్చి ఉంటుందనుకున్నా. ఇప్పుడు ఆమె చెప్పింది వింటే, ముందే ఆమెకు విషయం చెప్పేసి ఉండాల్సిందనిపించింది. కానీ, వాడు చెప్పిన కథ నాకే నమ్మకంగా లేదు, ఇంక ఆమెని ఎలా నమ్మిస్తాను?

అందుకే, వాడిని వెతికి తేవటానికి నేనే బయలుదేరాను. దమ్మాయిగూడ దాటి ముందుకు వెళ్ల గలిగినంత దూరం వెళ్లాను. వారినీ, వీరినీ అడుగుతూ కూడ దగ్గరకు వెళ్లాను.

నేను వెళ్లే సరికి చీకటి పడుతోంది.

అంతలో నా దృష్టి ఓ పెద్దబండ రాయి మాటున ఉన్న ఆ పాడుపడిన ఇంటిపై పడింది.

గుండె ఝల్లు మంది. జేబులోని టార్చిని గట్టిగా పట్టుకుని ఆవైపు అడుగులు వేశాను. చల్లగాలి వీస్తోంది. ఆకాశం నల్లబడుతోంది. ఆకాశం తెరలో రంధ్రాలు పొడుస్తున్నట్టు తారలు వెలుపలకు తొంగి చూస్తున్నాయి.

నెమ్మదిగా ఇంటిని సమీపించాను.

శబ్దం కాకుండా ఇల్లు చేరి, లోపలకు తొంగి చూశాను.

నా ఊహ కరెక్టే. రూప్‌కుమార్ గోడకి అనుకుని నిలుచున్నాడు.

గడ్డం పెరిగి ఉంది. నీరసంగా ఉన్నాడు. కానీ కళ్లు తళతళ మెరుస్తున్నాయి. చుట్టూ చూశాను.

ఎక్కడా మరో వ్యక్తి ఉన్న జాడలేదు. రూప్‌కుమార్ దృష్టి శూన్యంలోకి చూస్తున్నట్టుంది.

గడియారం వైపు చూశాను. సాయంత్రం ఆరున్నర దాటింది.

ఆకాశం వైపు చూశాను. నల్లబడింది.

వాడిని పిలిస్తే వస్తాడు? లేక ఆ దయ్యం అమ్మాయి వచ్చేదాకా ఆగి, ఆమెని ఒప్పించి, వీడిని తీసుకుపోవాలా? అని అలోచించాను.

బహుశా నా మనసులో ఏదో ఓ మూల ఆ అమ్మాయిని చూడాలన్న కోరిక ఉందేమో, అందుకే శబ్దం చేయకుండా ఎదురు చూస్తూ నిలబడ్డాను.

జేబులో టార్చి ఉంది. మరో జేబులో ఆంజనేయ దండకం పుస్తకం ఉంది.

ఇంతలో రూప్‌కుమార్ కళ్లు వెలిగాయి.

నా ఒళ్లు జలదరించింది.

కాలం కాళ్లతో నడచినట్టు 'ఎవరో నా పక్కనుంచి నడుస్తూ వెళ్లిన అనుభూతి. ఒక నీడ ఊపిరి పీల్చేటంత సున్నితంగా, నిశ్శబ్దంగా ఎవరో ఆ గదిలోకి అడుగు పెట్టిన భావన. ఎక్కడా శరీరం కదలిక లేదు. కానీ ఎవరో ఉన్న భావన.

ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలి? నా ప్రేమ పరీక్ష ఎప్పుడు పూర్తవుతుంది? చూడు, వారం రోజులు ఇక్కడే ఉన్నాను. ఇంక ఇక్కడే ఉంటాను. ఎక్కడికీ వెళ్లను. నాది నిజమైన ప్రేమ నన్ను నిమ్ము' అంటున్నాడు రూప్‌కుమార్.

వాడు ఎవరితో మాట్లాడుతున్నాడో తెలియటం లేదు. టార్చి వేయాలన్న కోరికను బలవంతంగా అణచుకున్నాను.

లోపల సరిగ్గా చూడాలని ఇంకాస్త ముందరికి జరిగాను.

'నన్ను నమ్ము. నిన్ను పొందటానికి నా శరీరం ప్రతిబంధకమైతే, ఈ శరీరాన్ని ఇప్పుడే వదిలేస్తాను. నాకీ శరీరం వద్దు. బంధువులు వద్దు.' ఆవేశంగా అంటున్నాడు రూప్‌కుమార్.

వాడు పిచ్చివాడని నిర్ధారణ అయింది.

ఎందుకంటే, అక్కడ ఎవ్వరూ లేరు. ఆ గదిలో రూప్‌కుమార్ ఒక్కడే ఉన్నాడు. గదిలోకి సన్నగా పడుతున్న నక్షత్రాల వెలుతురు గదిని స్పష్టంగా చూపిస్తోంది. నా కళ్లు చీకటిని చూడటానికి అలవాటు పడ్డాయి.

గదిలో రూప్‌కుమార్ ఒక్కడే ఉన్నాడు. శూన్యాన్ని బతిమిలాడుతున్నాడు.

'నేను నిన్ను ప్రేమించాను. నిన్ను తాకిన తరువాత నా భౌతిక ప్రపంచంపై ఆసక్తి నశించింది. నా నిజాయితీ నిరూపించుకోటానికి నేనేం చేయాలి? నిన్ను నమ్మించాలంటే ఏం చేయాలి? ఇదిగో, ఇప్పుడే ప్రాణత్యాగం చేస్తాను.' అని లేచి వెర్రివాడిలా దగ్గరే ఉన్న ఓ ఇనుపసీకును చేతిలోకి తీసుకున్నాడు.

వాడేం చేయబోతున్నాడో నాకు అర్థమైంది. ఇక నేను ఉపేక్షిస్తే లాభం లేదు.

'రూప్‌కుమార్. పిచ్చి పనులు చేయకు' అని అరుస్తూ గదిలోకి దూకాను.

వాడి చేయి పట్టుకుని లాగాను. చేతిలోంచి ఇనుప సీకు లాగి పడేసి.

'పిచ్చా, వెర్రా... ఏమిటిది? అక్కడ సంగీత ఎంత భయపడుతోందో తెలుసా?

ప్రాణప్రదంగా ప్రేమించే భార్యను వదిలి ఏమిటీ వెర్రి' అని కోపంగా అంటున్న నేను ఆగిపోయాను.

ఎందుకంటే రూప్‌కుమార్ నావైపు చూడటం లేదు. నా మాటలు వినటం లేదు. అతడి కళ్లల్లో భయం స్పష్టంగా కనిపిస్తోంది. భయంతో వణికి పోతున్నాడు.

'ఏమైంది?' అని అడిగి, అతడు చూస్తున్న వైపు చూశాను.

నిశ్చేష్టుడనై పోయాను.

నేను చూస్తున్నది కలా? నిజామా? భయమా? భ్రాంతియా? తెలియదు... కానీ... అక్కడ ఓ అమ్మాయి ఉంది.

నిలబడి ఉంది.

నా వైపే విచిత్రంగా చూస్తోంది. ఆమె చూపులు భయంకరంగా ఉన్నాయి.

'ఇన్నాళ్లకు వచ్చావా? నా కోసం వచ్చావా?'

ఆమె దూరంగా ఉన్నట్టనిపిస్తున్నా, ఎవరో చెవుల్లో గుసగుసలాడుతున్నట్టు అనిపించింది. నాకు పిచ్చెక్కుతోంది.

ఏమిటది?

నాకు పరుగెత్తాలనిపించింది. పరుగెత్తలేక పోయాను. కాళ్లు, ఇనుపరాళ్లలా అనిపించాయి.

నోరు కదలటం లేదు.

ఏం జరుగుతోందో తెలియటం లేదు...

నాకు మెలకువ వచ్చే సరికి తెల్లారింది.

నేనొక్కడినే గదిలో పడి ఉన్నాను.

రాత్రి ఏం జరిగిందో అర్థం కాలేదు? రూప్‌కుమార్ ఏమయ్యాడు?

నాకెంతో బాధ కలిగింది.

ఆ దయ్యం వాడిని తీసుకుని వెళ్లిపోయి ఉంటుంది. అడ్డు వచ్చిన నా స్పృహ పోగొట్టింది. పోన్లే మంచి దయ్యం. ప్రాణాలు తీయలేదు.

ఇల్లు ఎలా చేరుకున్నానో గుర్తు లేదు. నేను మరచిపోయేముందే జరిగిందంతా గుర్తున్నది. గుర్తున్నట్టు రాశాను.

ఫోన్లో చెప్పటం కన్నా సంగీతను కలిసి చెప్పటమే మంచిదనిపించింది. ఏమో, రూప్‌కుమార్ తనని వదలి దయ్యంతో పారిపోయాడని తెలిస్తే సంగీత నన్ను ఇష్టపడుతుందేమో! నాదవుతుందేమో!

చకచకా సంగీత ఇల్లు చేరుకున్నాను.

ఇంట్లో అడుగు పెడుతూంటేనే వాళ్ల మాటలు వినిపించాయి.

'సంగీత, నన్ను క్షమించు. నాకు బుద్ధి వచ్చింది. నేనంటే వాడికి అంత ప్రేమ ఉందనుకోలేదు. నా కోసం వాడు ప్రాణాలు అర్పించాడు. నన్ను రక్షించటం కోసం ఆ దయ్యం ఉచ్చులో పడ్డాడు వాడు..' అంటున్నాడు రూప్‌కుమార్.

'ఇదంతా నీ మీద ప్రేమకాదు. నేనంటే ఇష్టం వల్ల. నా కోసం...' అంటూ ముఖం చేతుల్లో దాచుకుని ఏడవటం ప్రారంభించింది సంగీత.

రూప్‌కుమార్ బ్రతికే ఉన్నాడా? అయితే నన్ను వదిలి వచ్చేశాడేమిటి? దయ్యం ఉచ్చులో పడింది వాడు, నేను పడ్డానంటాడేమిటి.

లోపలకు అడుగు పెట్టాను.

వాళ్లు నన్ను పట్టించుకోవటం లేదు. ఒకరొకరిని పట్టుకుని ఏడుస్తున్నారు.

వాళ్లని పిలవాలనుకున్నాను.

ఇంతలో ఎవరో నా పక్కన వచ్చి నిలబడ్డట్టయింది.

తిరిగి చూశాను...

ఆమె... ఆమె... నవ్వుతోంది....

నా దగ్గరగా వచ్చింది.

నన్ను.... కౌ... గ్గ్గ... ళ్ళ్ళ్...

*

చిరునామా:
కస్తూరి మురళీకృష్ణ
ప్లాట్‌నెం. 32, దమ్మాయి గూడ,
హైదరాబాద్ -83.
సెల్: 9849617392

## అభిమాన సంఘం వద్దన్న అనుష్క!

ఒకటి రెండు సినిమాలు చేసి వెండితెర మీద ముఖం కనపడగానే హీరోయిన్లు (అభిమాన సంఘం) ఫ్యాన్ క్లబ్ కోసం వెంపర్లాడతారు. 'అరుంధతి'తో సంచలనం సృష్టించిన అనుష్క మాత్రం తనకు ఫ్యాన్ క్లబ్ అక్కర్లేదని నిష్కర్షగా చెబుతోంది. అభిమాన సంఘం స్థాపిస్తామంటూ ఆమె అభిమానులు ఇటీవల అనుష్కను అడిగారు. దానికి ఆమె ససేమిరా ఇష్టపడలేదు. తాను ఇండస్ట్రీలో 'లెర్నింగ్' స్థాయిలోనే ఉన్నానని, ఇలాంటప్పుడు ఫ్యాన్ క్లబ్ ఏర్పాటుచేయడం అంత మంచిది కాదని ఆమె సున్నితంగా ఆ అభ్యర్థనను తోసిపుచ్చిందట! తమిళంలో హీరోలు విజయ్, సూర్య సరసన అనుష్క రెండు చిత్రాలు చేస్తోంది. విజయ్ సలహా మేరకే అనుష్క ఫ్యాన్ క్లబ్ అక్కర్లేదన్నదని పరిశ్రమలో వారంటున్నారు. ఫ్యాన్స్ అనుష్కను కాకుండా విజయ్‌ని అడిగి ఉంటే బావుండేదని మరికొందరు అంటున్నారు.

